క్లుప్తంగా

చదువుతోపాటు క్రీడలు ముఖ్యమే



యూనిఫాం ధరించిన తైక్వాండో విద్యార్థులతో ఉపాధ్యాయులు

దొర్నిపాడు: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో ముఖ్యమని ప్రధానోపాధ్యాయురాలు చెన్నకేశ్వరి సూచించారు. సోమవారం పాఠశాలలో తైక్వాండో క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేశారు. పూర్వపు విద్యార్థులు మనోజ్, జాఫర్ రూ.5 వేలతో 10 జతలు, అలాగే హెచ్‌ఎం చెన్నకేశ్వరి తన సొంత నిధులతో రూ.5 వేలు వెచ్చించి 10 జతల క్రీడా దుస్తులను తెప్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న పాఠశాల క్రీడాపోటీల్లో జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఉన్నత చదువులకు స్పోర్ట్స్ ధ్రువీకరణ పత్రాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో పీడీ దేవేంద్ర, ఉపాధ్యాయులు రమణయ్య, మౌలాలి, నాగరాజు, పుల్లయ్య, బాలకోటిరెడ్డి, కవిత, శ్యామల, నరసింహ, విశ్వనాథరెడ్డి, మధు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచితంగా క్రీడా దుస్తులు



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేస్తున్న ఎస్‌ఎంసీ చైర్మన్

ఉయ్యాలవాడ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న 30 మంది విద్యార్థులకు సోమవారం ఎస్‌ఎంసీ చైర్మన్ చెన్నయ్య ఉచితంగా క్రీడా దుస్తులు అందజేశా రు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలలో విద్యార్థులు రాణించి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకు రావాలని కోరారు. ప్రధానోపాధ్యాయుడు విజయకుమార్, వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రతాప్, ఉపాధ్యాయులు చైర్మన్‌ను అభినందించారు.

విద్యార్థులకు స్వయం ఉపాధి కోర్సులు



ఒకేషనల్ కోర్సుల ఎగ్జిబిషన్ పరిశీలిస్తున్న జీసీడీఓ

శిరివెళ్ల: విద్యతో పాటు విద్యార్థులకు స్వయం ఉపాధి కోర్సులను ప్రారంభిస్తున్నట్లు జీసీడీఓ నాగ సువర్చల అన్నారు. సోమవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆటో మోటివ్ అండ్ ఎలక్ట్రానిక్స్ ల్యాబ్‌లను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఉన్నత పాఠశాలలో ల్యాబ్‌లను మంజూరు చేసిందన్నారు. ఈ ఏడాదిలో 9, 10 తరగతుల వారికి వచ్చే ఏడాది నుంచి 6 వ తరగతుల విద్యార్థులకు కూడా కోర్సులను నేర్పించడం జరుగుతుందన్నారు. విద్యార్థులలో ఆవిష్కరణ, అభ్యాసం, సాంకేతిక నైపుణ్యాభివృద్ధి పట్ల ఆసక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గోవిందరాజులు, టీచర్లు పాల్గొన్నారు.

ప్రజా అర్జీలపై నిర్లక్ష్యం తగదు

ఉయ్యాలవాడ: ప్రజల నుంచి వచ్చే అర్జీలపై నిర్లక్ష్యం వహించకుండా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ప్రసాద్ బాబు, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు సూచించారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. తుడుములదిన్నె గ్రామానికి చెందిన రైతు వెంకట శ్రీనివాసులు తనకు చెందిన 233 సర్వే నంబర్‌లో 3.38 ఎకరాలు ఉండగా 92 సెంట్లు మాత్రమే ఆన్‌లైన్‌లో చూపుతూ వుందని, మిగిలిన భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరారు. అలాగే వివిధ గ్రామాల నుంచి పట్టాదారు పాసు పుస్తకాలు, ఆన్‌లైన్‌లో భూమిలో కొలతలు తేడాలు ఉన్నాయని రైతులు దరఖాస్తులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ రఘురామిరెడ్డి పాల్గొన్నారు.

జిల్లెల్లలో యూరియా పంపిణీ

గోస్పాడు: మండలంలోని జిల్లెల్ల గ్రామంలో సోమవారం ఆళ్లగడ్డ ఏడీఏ విజయశేఖర్, వ్యవసాయాధికారి స్వప్నికారెడ్డి ఆధ్వర్యంలో యూరియా పంపిణీ చేశారు. గ్రామంలోని సాయికృష్ణ ఫర్టిలైజర్స్ ఎరువుల షాపులో 130 యూరియా బ్యాగ్‌లను రైతులకు అందజేశారు. అంతకు ముందు వ్యవసాయాధికారులు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు.

ప్రజా సమస్యలపై పోరాటం

నంద్యాల(వ్యవసాయం): స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పోరాటం ఉధృతం చేయనున్నట్లు ఎస్‌డీపీఐ రాష్ట్ర నాయకులు హుస్సేన్‌పీరా అన్నారు. అసెంబ్లీ పరిధిలోని పంచాయతీ వార్డు నాయకులతో సోమవారం స్థానిక కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. హుస్సేన్ పీర మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో నంద్యాలలో ఎస్‌డీపీఐ బరిలో దిగి సత్తా చాటాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎజాస్ హుస్సేన్ మాట్లాడుతూ నంద్యాల పరిధిలోని అన్ని వార్డులు మేజర్ పంచాయతీలలో పోటీ చేయడానికి పార్టీ సిద్ధంగా ఉందని చెప్పారు.

నాడి తప్పిన పల్లె వైద్యం!

- గ్రామాల్లో విజృంభిస్తున్న విషజ్వరాలు
- పట్టనట్టు వ్యవహరిస్తున్న పీహెచ్‌సీల వైద్యులు
- నర్సాపురం పీహెచ్‌సీలో స్టాఫ్ నర్సే దిక్కు
- మెరుగైన వైద్యం అందక అవస్థలుపడుతున్న ప్రజలు



తలుపులు తెరుచుకోని తిప్పారెడ్డిపల్లె హెల్త్ సెంటర్



నర్సాపురం పీహెచ్‌సీలో రోగులు



తాళం వేసి ఉన్న వైద్యాధికారి గది



రోగికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న స్టాఫ్ నర్సు



విధులకు రాని ల్యాబ్ టెక్నీషియన్

రుద్రవరం: సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ప్రతి ఇంటిలో కనీసం ఒకరిద్దరు విషజ్వరాలు, దగ్గు, నొప్పులతో బాధపడుతున్నారు. గ్రామాల్లో పరిస్థితి ఇంత తీవ్రంగా ఉంటే వారికి అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాల్సిన డాక్టర్లు పీహెచ్‌సీల్లో కనిపించడం లేదు. ఉన్నతాధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో వైద్యులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో రోగులు సరైన వైద్యం అందక అవస్థలు పడుతున్నారు. సోమవారం రుద్రవరం మండల పరిధిలోని నర్సాపురం పీహెచ్‌సీలో స్టాఫ్ నర్సే వైద్య సేవలు అందించాల్సి వచ్చింది. ఈ పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు ఉన్నారు. సోమవారం వారిరువురు విధులకు డుమ్మా కొట్టారు. ఈ విషయం తెలియని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వివిధ ఆరోగ్య సమస్యలతో ఆసుపత్రికి వచ్చారు. గంటల తరబడి ఎదురుచూసినా వైద్యులు రాలేదు. చేసేది లేక కొందరు పట్టణానికి వెళ్లగా..మరికొందరు ఆసుపత్రిలోని స్టాఫ్‌నర్స్‌తోనే వైద్య చేయించుకొని ఇంటిబాట పట్టారు. రోగుల్లో అధిక మంది జ్వరబాధితులే ఉన్నారు. వీరు తమకు వచ్చింది ఏం జ్వరమో తెలుసుకొని మందులు వాడుదామనుకున్నా రక్తపరీక్షలు చేసే ల్యాబ్ టెక్నీషియన్ కూడా విధులకు హాజరు కాలేదు. నర్సాపురం పీహెచ్‌సీలో పరిస్థితి ఇలా ఉంటే తిప్పారెడ్డిపల్లెలో ఏకంగా హెల్త్ సెంటర్ తెరుచుకోలేదు. ఉదయమే ఆసుపత్రికి వచ్చిన రోగులు వైద్యుల కోసం మధ్యాహ్నం వరకు ఎదురుచూసి ఇళ్లకు వెళ్లిపోయారు. గత ప్రభుత్వంలో వైద్య సేవలు సక్రమంగా అందేవని కూటమి సర్కారు వచ్చినప్పటి నుంచి ఎవరికి వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, ప్రశ్నిస్తే ప్రభుత్వం తమకు సర్వే బాధ్యతలు అప్పగించిందని వైద్య సిబ్బంది చెబుతున్నారని మండల ప్రజలు వాపోతున్నారు. ఈ ప్రభుత్వానికి తమ ప్రాణాల కంటే సర్వేల ముఖ్యమయ్యాయని మండిపడుతున్నారు. ఇదిలా ఉంటే నర్సాపురం పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు, ల్యాబ్ టెక్నీషియన్ విధులకు హాజరు కాకపోవడం, తిప్పారెడ్డిపల్లె హెల్త్ సెంటర్ తెరవని విషయాన్ని జిల్లా వైద్యాధికారి వెంకటరమణ దృష్టికి తీసుకెళ్లగా విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటానని చెప్పారు. వైద్య సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండి వారికి అవసరమైన సేవలు అందించాలన్నారు. విధులకు డుమ్మాకొట్టిన విషయం తనకు తెలియదన్నారు.

దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న ఆర్యవైశ్యులు

రుద్రవరం: స్థానిక కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఈ నెల 22 నుంచి నిర్వహించనున్న దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రికను సోమవారం ఆర్యవైశ్య సంఘం సభ్యులు ఆవిష్కరించారు. సంఘం అధ్యక్షుడు చోళవేటి సూర్య నారాయణ, కోశాధికారి పెరుమాళ్ల నరసింహయ్య, సెక్రటరీ పాలూరు వెంకట సుబ్రమణ్యం, కమిటీ సభ్యులు పత్రికలను ముందుగా అమ్మవారి సన్నిధిలో ఉంచి పూజలు చేయించారు. అనంతరం మొదటి పత్రికను అర్చకులు విశ్వనాథశర్మకు అందజేశారు. అనంతరం గ్రామంలోని ఆర్యవైశ్యుల ఇళ్లకు వెళ్లి పత్రికలను పంపిణీ చేశారు. ఈ నెల 22 నుంచి మొదలయ్యే నవరాత్రి ఉత్సవాలకు అందరు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, భరత్, సురేంద్ర, నాగేశ్వరావు, మోహన్ క్రిష్ణ, వెంకటేశ్వర్లు, యశ్వంత్ తదితరులు ఉన్నారు.

పదవ తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలి

నంద్యాల(న్యూటౌన్): రాబోయే పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని రాష్ట్ర మోడల్ స్కూల్ అకాడమిక్ మానిటరింగ్ అధికారి కృష్ణవేణి, ఏఏఎంఓ సలీం పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని బొమ్మలసత్రంలో ఉన్న ఆదర్శ పాఠశాలను సందర్శించారు. పిల్లల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పిల్లల్లో ఉన్న రీడింగ్, రైటింగ్ స్కిల్‌ను మెచ్చుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మిట్నాలలో నిర్మాణం జరుగుతున్న మోడల్ స్కూల్‌ను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను, సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఆదర్శ పాఠశాల కో ఆర్డినేటర్ డాక్టర్ ఇష్రాత్‌బేగం, ప్రిన్సిపాల్ మల్లికార్జునప్ప, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై స్పందించకపోతే సమ్మె



చాగలమర్రి లో ఎంపీడీఓకు వినతి పత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

రుద్రవరం: తమ సమస్యలు గుర్తించి పరిష్కారానికి చొరవ చూపాలని లేదంటే సమ్మెకు దిగు తామని సచివాలయ ఉద్యోగులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల సచివాలయ ఉద్యోగులు సోమవార డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సుబ్రమణ్యంకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు పనిభారం తగ్గించాలన్నారు. అలాగే ప్రతి నెల 1వ తేదీన వేతనాలు అందించాలని, అర్హత కలిగిన వారికి పదోన్నతులు కల్పించాలని, బదిలీలకు అవకాశం ఇవ్వాలని కోరారు. వీటిపై సర్కారు సానుకూలంగా స్పందించకపోతే దశల వారీగా ఆందోళ నలు చేపడతామని హెచ్చరించారు.

చాగలమర్రి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులు తమ డిమాండ్లపై సోమవారం ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్‌కు వినతి పత్రం సమర్పించారు. సర్వేల పేరిట తమకు ఇంటింటికి తిప్పడం సరికాదన్నారు. నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో మండలంలోని అన్ని సచివాలయాల సిబ్బంది ఉన్నారు.

12వ పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించాలి

నంద్యాల(న్యూటౌన్): 12వ పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించాలని పీఆర్‌టీయూ సీనియర్ నాయకులు ఐజయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కరరెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ 12వ పీఆర్సీ కమిషన్ నియమించడం ఆలస్యం అవుతున్నందున 30శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న కరువు భత్యం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించరాదన్నారు. సమావేశంలో పీఆర్‌టీయూ నాయకులు సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు విజయరావు, మండల అధ్యక్షుడు కలీముల్లా, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

రామకృష్ణ డిగ్రీ కళాశాలలో ప్లేస్‌మెంట్ డ్రైవ్

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాలలో కే12 టెక్నో సర్వీస్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో సోమవారం ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. టెక్నో సర్వీస్ కంపెనీ ప్రతినిధులు లేఖశరణ్య, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఇంతియాజ్ అహమ్మద్, మాధవరెడ్డి, కళాశాల డైరెక్టర్ హేమంతరెడ్డి మాట్లాడుతూ త్వరలోనే విద్యార్థులకు పరీక్ష నిర్వహించి ఇంటర్వ్యూలు చేస్తామన్నారు. డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు, మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని వినతి



డీఆర్‌ఓకు వినతి పత్రం అందజేస్తున్న రెడ్డి సంఘం నాయకురాలు

నంద్యాల(వ్యవసాయం): రాష్ట్రంలో ఆర్థికంగా వెనుకబడి ఉన్న రెడ్డి కులస్తుల కోసం ప్రత్యేకంగా రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సానంరెడ్డి సుహాసిని డిమాండ్ చేశారు. సోమవారం ఆమె డీఆర్‌ఓ రామునాయక్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసి పాలక మండలిని సైతం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కూటమి సర్కారు వచ్చాక రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రామేశ్వరరెడ్డి, వెంకటరెడ్డి, రమణారెడ్డి, భరత్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం



రాష్ట్రస్థాయి విజేతలతో చెస్ సంఘం నాయకులు

నంద్యాల(న్యూటౌన్): ర్యాపిడ్, బ్లిట్జ్ విభాగాల్లో రాష్ట్రస్థాయి విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బహుమతులను అందజేసినట్లు జిల్లా చెస్ సంఘం అధ్యక్షుడు రవికృష్ణ, టోర్నమెంట్ డైరెక్టర్ రాజేష్, కార్యదర్శి రామసుబ్బారెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో విజేతలను అభినందించి మాట్లాడారు. రాష్ట్రస్థాయి విజేతలు జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్రం తరఫున పాల్గొంటారన్నారు. క్రమశిక్షణతో నిరంతరం సాధన చేస్తే విజయాలు సాధించవచ్చన్నారు. రాష్ట్రస్థాయి విజేతలుగా ర్యాపిడ్ విభాగంలో ప్రథమ స్థానం శివపవన్‌తేజ శర్మ (ఎన్‌టీఆర్ జిల్లా), రెండో స్థానం లక్ష్మిత్(కర్నూలు జిల్లా), బ్లిట్జ్ విభాగంలో మొదటి స్థానం సాత్విక్ (కోనసీమ జిల్లా), రెండో స్థానం రామ్‌చరణ్ తేజ (తూర్పు గోదావరి జిల్లా), ఎస్‌ఆర్‌జీ చెస్ అకాడమీ విభాగంలో నీలేష్, శాలినీలు స్థానాలు పొందినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సోమేసుల నాగరాజు, కార్యదర్శి భాస్కరరెడ్డి, కోశాధికారి జనార్దన్, నీలాప్రసాద్, జిల్లా వైద్య శాఖ ఏఓ డాక్టర్ భరత్, టోర్నమెంట్ నిర్వాహకులు సుజాత, ప్రతినిధులు రాజారమేష్ చక్రవర్తి, ఇమామ్, కర్నూలు జిల్లా ప్రెసిడెంట్ రాకేష్‌రెడ్డి, ప్రకాశం జిల్లా చెస్ ప్రెసిడెంట్ కొండారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గాలి కుంటు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ఉయ్యాలవాడలో బర్రెలకు టీకాలు వేస్తున్న పశు వైద్యాధికారి

ఉయ్యాలవాడ : పాడి పెంపకం దారులు గాలి కుంటు వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండి పశువులను కాపాడుకోవాలని పశు వైద్యాధికారి రఘుబాలపుల్లయ్య సూచించారు. సోమవారం జాతీయ పశు వ్యాధి నివారణ వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఎస్సీ కాలనీలో పశువులకు టీకాలు వేశారు. 347 గేదెలకు, ఆవులకు టీకాలు వేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాన్ని ఈ నెల 15 నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు అన్ని గ్రామాలలో పశువులకు టీకాలు వేయనున్నట్లు వెల్లడించారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా రంగ ప్రతిభా పురస్కారం



అవార్డు అందుకుంటున్న పీఈటీ పుల్లయ్య

నంద్యాల(న్యూటౌన్): సినీ నటి రజిత శాండే చేతుల మీదుగా క్రీడా రంగ ప్రతిభా పురస్కారాన్ని పీఈటీ పుల్లయ్య అందుకున్నట్లు సమస్త మదర్ సొసైటీ సంస్థ వ్యవస్థాపకులు మల్లాది ప్రసాద్ తెలిపారు. సోమవారం విజయవాడలోని అక్కినేని నాగేశ్వరరావు కళా కేంద్రంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, ఒడిశా, తమిళనాడు, ఢిల్లీ రాష్ట్రాల్లో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించిన వారిని పిలిపించి సత్కరించారు. జిల్లా నుంచి పీఈటీ పుల్లయ్యకు క్రీడా సేవా రంగం ప్రతిభా పురస్కార అవార్డును అందజేశారు.

ఘనంగా హిందీ దివస్



వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సోమవారం హిందీ దివస్ (హిందీ భాషా దినోత్సవం)ను ఘనంగా నిర్వహించారు. మండలంలోని కోటకందుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం శకుంతలమ్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, క్విజ్ పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు హిందీలో ప్రతిభ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అంతకు ముందు విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఉపాధ్యాయులు వరమ్మ, కిరణ్, కృష్ణవేణి, నాగేశ్వర్‌రెడ్డి, నాగభూషన్‌రెడ్డి, సంజీవరాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వేను వంద శాతం పూర్తి చేయాలి



పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

ఉయ్యాలవాడ : గ్రామాల్లో చేపట్టిన స్వామిత్వ సర్వేను వంద శాతం పూర్తి చేయాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్.పాంపల్లె, అల్లూరు, పడిగెపాడు, బోడెమ్మనూరు, పెద్దయమ్మనూరు, ఎస్.కొత్తపల్లె గ్రామాల్లో 2,787 ఆస్తులకు సంబంధించి సర్వే చేయవలసి ఉండగా ఇప్పటి వరకు 2003 ఆస్తుల సర్వేను పూర్తి చేయడం జరిగిందన్నారు. మిగిలిన వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ నాగలక్ష్మమ్మ, మండల కోఆర్డినేటర్ రమణారెడ్డి పాల్గొన్నారు.

కుందూలో తగ్గిన ప్రవాహం



కుందూనది వంతెనపై రాకపోకలు సాగిస్తున్న గ్రామస్తులు

దొర్నిపాడు: గత నెల రోజులుగా కుందూనదిలోని వరదనీటిలో మునిగిపోయిన వంతెన సోమవారం బయటపడటంతో రాకపోకలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం వరద ఉద్ధతి తగ్గడంతో క్రిష్టిపాడు రైతులు ఊపిరి పీల్చుకుంటున్నారు. సాగుచేసిన పంటలను చూసుకునేందుకు వీలు లేక నానా అవస్థలు పడ్డారు. అంతేగాక బ్రిడ్జి పరిస్థితి ఎలా ఉందనే ఆందోళన కూడా మెండుగా ఉండేది. అక్కడక్కడ కోతకు గురైనట్లు స్థానికులు చెబుతున్నారు. వ్యవసాయ పనులకు ఎలాంటి ఇబ్బంది లేదని రైతులు పేర్కొంటున్నారు.

నేడు బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్ కాంప్లెక్స్ సందర్శన



మాట్లాడుతున్న బొజ్జా దశరథరామిరెడ్డి

నంద్యాల(అర్బన్): బానకచర్ల రెగ్యులేటర్ కాంప్లెక్స్ వద్ద రాయలసీమ నీటి హక్కులతో జరిగే నష్టంపై చేపట్టే సందర్శన కార్యక్రమానికి రైతులు, ప్రజలు వేలాదిగా తరలి వచ్చి విజయవంతం చేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి పిలుపునిచ్చారు. తెలుగుగంగ, హంద్రీనీవా, ఎస్సార్బీసీ, గాలేరునగరి ప్రాజెక్టుల వాస్తవ పరిస్థితులను ఆయా ప్రాంత ప్రజా సంఘాల నాయకుల ద్వారా తెలుసుకొని పాలకులపై ఒత్తిడి పెంచేందుకు రావాలన్నారు. స్థానిక కార్యాలయంలో సమితి నాయకులతో కలిసి సోమవారం ఆయన మాట్లాడుతూ రాయలసీమ హక్కుగా ఉన్న నీటిని సకాలంలో అందించాలన్నారు. రెగ్యులేటర్ల నీటి ప్రవాహాన్ని మార్చి కృష్ణా జలాలను నెల్లూరు వైపు తరలించే కార్యక్రమం చేపట్టడం దారుణమన్నారు. సీమలో బలవంతపు భూసేకరణ, కుందూ గాలేరి నదులను కాల్వగా మార్చే క్రమంలో పర్యావరణ నాశనానికి పాలకులు శ్రీకారం చుట్టబోతున్నారన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు వెనుక జలాలను రాయలసీమకు అందించడానికి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌తో పాటు మరొక నిర్మాణం హంద్రీనీవా, ఎత్తిపోతల పథకం అవసరమన్నారు. ఈ పథకం ద్వారా మల్యాల నుంచి కృష్ణా జలాలను ఎత్తి పోస్తూ 6లక్షల ఎకరాలకు నీరు అందించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షులు వైఎన్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, మహేశ్వరరెడ్డి, సుధాకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలు మరువలేనివి



రక్తదాతలకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న దృశ్యం



కళాశాల అధ్యాపకులను సన్మానిస్తున్న క్లబ్ సభ్యులు

గోస్పాడు: ఇంజనీర్‌గా మోక్షగుండం విశ్వేశ్వరయ్య అందించిన సేవలు మరువలేనివని జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ అధికారి నాగరాజు అన్నారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ కార్యాలయంలో సోమవారం ఇంజనీర్స్ డే సందర్భంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య సేవలను, గొప్పతనాన్ని స్మరించుకొని ఆయన బాటలో పయనించి ఇంజనీరింగ్ అధికారులు శాఖకు మంచి పేరు తీసుకొని రావాలని అన్నారు. అలాగే ఇంజనీరింగ్ అసిస్టెంట్ల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఇంజనీరింగ్ అసిస్టెంట్లను అభినందించారు. అనంతరం వారికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులుపాల్గొన్నారు.

ఇంజినీర్లకు సన్మానం

నంద్యాల(వ్యవసాయం): భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం జాతీయ ఇంజినీర్ల దినోత్సవం నిర్వహించారు. విశ్వేశ్వర య్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ శైలేంద్రకుమార్ మాట్లాడుతూ దేశ నిర్మాణ, అభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర విశిష్టమైనదన్నారు. డాక్టర్ సహదేవుడు, రవికృష్ణ మాట్లాడుతూ వైద్య బయోమెడికల్ వ్యవసాయ రంగం, సమాచార విప్లవంలో ఇంజినీర్ల పాత్ర అద్వితీయమైనదని అన్నారు. కళాశాల సీనియర్ అధ్యాపకులు సంజీవరాయుడు, విద్యాశ్రీ, సాయినాథరెడ్డి, శాలువా, జ్ఞాపికలతో సత్కరించి లయన్స్‌క్లబ్ జాతీయ ఇంజినీర్స్ పురస్కారాలు అందజేశారు. విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు నాగరాజు, భాస్కరరెడ్డి, జనార్దన్, సుధాకర్‌రెడ్డి, నిజాముద్దీన్, చంద్రశేఖర్,రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

అంధ విద్యార్థులకు అన్నదానం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని సీనియర్ న్యాయవాది, వైఎస్సార్‌సీపీ నాయకుడు బాచిరెడ్డి రామకృష్ణారెడ్డి కుమారుడు జ్ఞాపకార్థం సోమవారం అంధుల పాఠశాలలోని విద్యార్థులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 సెప్టెంబర్ 15వ తేదీన రాజమండ్రి బోట్ ప్రమాదంలో తన కుమారుడు, కోడలు, మనవళ్లు, మనవరాళ్ల మృతి చెందారన్నారు. వారి జ్ఞాపకార్థం 50 మంది చిన్నారులకు అన్నదానం, నిత్యావసర సరుకుల కిట్లు అందజేసినట్లు తెలిపారు.

ఆటో కార్మికులకు రూ.25వేలు ఇవ్వాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): వాహన మిత్ర పథకం కింద ప్రతి కార్మికుడికి ఏటా రూ.25 వేలు, ప్రమాదవశాత్తు ఆటో డ్రైవర్ చనిపోతే రూ.10లక్షలు సాయం అందజేయాలని ఏఐటీయూసీ, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు.ఈ అంశంపై వారు సోమవారం నంద్యాల జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా నాయకులు రఘురామ్మూర్తి, పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ చదువుకున్న విద్యార్హతను బట్టి ఆర్టీసీలో ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సహజ మరణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని, గౌండాలకు ఇస్తున్న సంక్షేమ బోర్డు ప్రకారం ఆటో డ్రైవర్లకు కూడా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, 50 సంవత్సరాలు దాటిన ప్రతి ఆటో డ్రైవర్‌కు నెలకు పింఛన్ ఇవ్వాలన్నారు. నంద్యాల పట్టణంలో పోలీసులు, ఆర్‌టీఓ అధికారుల వేధింపులు ఆపాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులతో పాటు ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.